

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో


02

- ఐదు ఆర్డీవో భవనాల నిర్మాణం
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు

- మొదటి విడుతలో 60 ఎమ్మార్వో ఆఫీసులు

04



సంపుటి :02 | సంచిక :316 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

బుధవారం 25, ఫిబ్రవరి 2026

ఘోష్ కమిషన్ నివేదికపై

## విచారణ ఎల్లుండికి వాయిదా

- హరీశ్ రావు తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్

04






- వరంగల్, మానుకోటలో మార్కెట్లలో నిలిచిన మిర్చి కొనుగోళ్లు
- అన్నదాతలకు తప్పని తిప్పలు
- కేసముద్రంలో మాన్యువల్ పద్ధతిలో కొనుగోళ్లు
- వరంగల్ ఎనుమాములలో మొదటి వర్షన్ సాఫ్ట్‌వేర్ వినియోగించి విక్రయాలు

# ఈ-నామ్ 2.0.. పనితీరు జీరో

### కొత్త సాఫ్ట్‌వేర్ మొదటి రోజే ఫ్లాప్

అన్నదాత కష్టాన్ని సులభతరం చేస్తామంటూ సర్కారు గొప్పగా ప్రవేశపెట్టిన 'ఈ-నామ్ 2.0' సాఫ్ట్‌వేర్ మొదటి రోజే రైతుల పాలిట శాపంగా మారింది. డిజిటలైజేషన్ ముసుగులో తీసుకొచ్చిన ఈ కొత్త వెర్షన్ సర్వర్ల మొరాయింపుతో మార్కెట్లలో కొనుగోళ్లు పూర్తిగా స్తంభించిపోయాయి. ఎనుమాముల నుంచి ఎద్యుకేటెడ్ మార్కెట్ల వరకు అంతా గందరగోళమే నెలకొంది. ఆధార్ నంబర్లు, పిన్ కోడ్లు, పుట్టిన తేదీల ఆంక్షలతో సామాన్య రైతుకు చుక్కలు కనిపించాయి. ఆరుగాలం కష్టపడి తెచ్చిన పంటను అమ్ముకోవడానికి టెక్నాలజీతో యుద్ధం చేయాల్సి రావడంతో మార్కెట్ యార్డుల్లో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్కరణల పేరుతో తమను నరకానికి గురిచేయొద్దంటూ రైతులు మండిపడుతున్నారు. – అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి

02



## మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి లొంగిపోవాలి

- ఆయన సోదరుడు రామచంద్రరావు విజ్ఞప్తి
- గణపతి లొంగిపోతే ఆయనపై కేసులు ఎత్తివేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి


04

మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి పోలీసులకు లొంగిపోవాలని ఆయన సోదరుడు రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు. 'ఆపరేషన్ కాగార్' చివరి దశకు చేరుకున్న తరుణంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే పార్టీకి చెందిన పలువురు అగ్రనేతలు వరుసగా లొంగిపోతున్నారు. తిప్పిరి తిరుపతి, చొక్కారావు అలియాస్ దామోదర్, మల్లా రాజిరెడ్డి, నర్సింహారెడ్డి వంటి ప్రముఖ నేతలతో పాటు సుమారు 20 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే గణపతి ఆచూకీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

- అక్షరదర్బార్, హైదరాబాద్

మీడియా అకాడమీ

## చైర్మన్ పదవి రెండేళ్లు పొడిగింపు



- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రప్రభుత్వం

04

## ఉద్యాన పంటలతోనే అధిక ఆదాయం

- రైతులకు ఎకరానికి రూ. లక్ష నికర లాభం
- ఆయిల్ పామ్ సాగుకు రూ. 50 వేల రాయితీ
- సర్పంచుల శిక్షణా శిబిరంలో జిల్లా ఉద్యాన అధికారి మరియన్న

02





# ఈ-నామ్ 2.0

## పనితీరు జీరో

- కొత్త సాఫ్ట్‌వేర్ మొదటి రోజే ఫ్లాప్
- వరంగల్, మానుకోట మార్కెట్లలో నిలిచిన మిర్చి కొనుగోళ్లు
- అన్నదాతలకు తప్పని తిప్పలు
- కేసముద్రంలో మాన్యువల్ పద్ధతిలో కొనుగోళ్లు
- వరంగల్ ఏనుమాములలో మొదటి వర్షన్ సాఫ్ట్‌వేర్ వినియోగించి విక్రయాలు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

సాంకేతిక సంస్కరణల పేరుతో ప్రభుత్వం తెచ్చిన మార్పులు రైతులకు శాపంగా మారాయా? కొత్త వెర్షన్ మొరాయించడంతో మార్కెట్లలో కొనుగోళ్లు నిలిచిపోవాలా? అన్నదాతలు పండించిన పంటను అమ్ముకోవడానికి గంటల తరబడి నిరీక్షించాలా? అనే ప్రశ్నలకు సమాధానాలు.. అవుననే వస్తున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చిన జాతీయ ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ విధానం (ఈ-నామ్) 2.0 వెర్షన్ ప్రారంభం రోజే అట్టర్ ఫ్లాప్ అయింది. కొత్త సాఫ్ట్‌వేర్ సర్వర్ల మొరాయింపుతో వ్యవసాయ మార్కెట్లలో కొనుగోళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వరంగల్ ఎనుమాముల, మహబూబాబాద్ వంటి ప్రధాన మార్కెట్లలో మిర్చి కొనుగోళ్లు జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేల క్వింటాళ్ల సరుకుతో వచ్చిన రైతులు గేట్ ఎంట్రీ రసీదుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### - మాన్యువల్ పద్ధతిలో కొనుగోళ్లు

వరంగల్ జిల్లాలోని కేసముద్రం, జనగాం వ్యవసాయ మార్కెట్లలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కొత్త వెర్షన్‌లో రైతు పుట్టిన తేదీ, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్, గ్రామం పిన్ కోడ్ వంటి వివరాలను నమోదు చేయడం తప్పనిసరి చేశారు. చాలామంది రైతులకు తమ పుట్టిన తేదీ వివరాలు తెలియకపోవడం, ఆధార్ కార్డులు వెంట తెచ్చుకోకపోవడంతో డేటా ఎంట్రీ ప్రక్రియ స్తంభించిపోయింది. ఒకవేళ వివరాలు నమోదు చేసినా సాంకేతిక లోపాల వల్ల కంప్యూటర్లు వాటిని స్వీకరించలేదు. సర్వర్లు డౌన్ కావడంతో మధ్యాహ్నం రెండు గంటల వరకు కూడా ఈ-టెండర్లు వేయడం సాధ్యపడలేదు. చివరకు గత్యంతరం లేక కేసముద్రంలో మాన్యువల్ పద్ధతిలో, ఎనుమాములలో పాత 1.0 వెర్షన్ ద్వారా కొనుగోళ్లు జరిపారు.

### - రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 47 ఈ-నామ్ మార్కెట్లలో ఇదే పరిస్థితి నెలకొంది. నిరక్షరాస్యులైన రైతులు ఆధార్ కార్డులు, పిన్ కోడ్ల కోసం ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం కొత్త నిబంధనలను సమర్థిస్తున్నారు. ఒక్కసారి వివరాలు నమోదు చేస్తే భవిష్యత్తులో సులభంగా ఉంటుందని చెబుతున్నారు. కేవలం తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఈ 2.0 వెర్షన్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మార్కెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది. డిజిటలైజేషన్ పేరుతో క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోకుండా ఇలాంటి కఠిన నిబంధనలు పెట్టడంపై రైతు సంఘాలు మండిపడుతున్నాయి.

### - రైతుల ఆందోళన

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తెస్తే, టెక్నాలజీ పేరుతో గంటల తరబడి వేచి చూడటం తమకు నరకప్రాయంగా ఉందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలోని పలు మార్కెట్లలో ధాన్యం, మిర్చి అమ్ముకోవడానికి వచ్చిన రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సులువైన పద్ధతిలో పంట విక్రయాలు జరిగేలా చూడాలని, సంక్లిష్టమైన నిబంధనలతో తమను వేధించవద్దని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి సర్వర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రైతులకు అవగాహన కల్పించిన తర్వాతే కొత్త వెర్షన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఉద్యాన పంటలతోనే అధిక ఆదాయం

- రైతులకు ఎకరానికి రూ. లక్ష నికర లాభం
- ఆయిల్ పామ్ సాగుకు రూ. 50 వేల రాయితీ
- సర్పంచుల శిక్షణా శిబిరంలో జిల్లా ఉద్యాన అధికారి మరియన్న

అక్షర దర్బార్, మహబూబాబాద్ : సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి మార్కెట్ డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలు సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న సూచించారు. బుధవారం జిల్లాలోని తొర్రూరు, నర్సింహులపేట, నెల్లికుదురు, గార్ల, డోర్నకల్ మండలాల సర్పంచులకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయిల్ పామ్, మల్బరీ, పండ్ల తోటలు, పుట్ట గొడుగులు, తేనెటీగల పెంపకం వంటి లాభదాయక సాగుపై అవగాహన కల్పించారు.

### భారీగా ప్రభుత్వ రాయితీలు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు, నిర్వహణ, బిందు సేద్యం కలిపి ఎకరానికి రూ. 50,918 రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పండ్ల తోటల విస్తరణలో భాగంగా మామిడి, నిమ్మ, జామ సాగుకు ఎకరానికి రూ. 19,200, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ. 64,800 చొప్పున సబ్సిడీ ఇస్తున్నట్లు వివరించారు. కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి రూ. 50,000, మల్బరీ సాగు-షెడ్ నిర్మాణానికి ఏకంగా రూ. 5 లక్షల వరకు రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు.

### ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు


రైతులు ఆధునిక పద్ధతులైన మల్చింగ్, బిందు సేద్యం పాటిస్తూ అంతర పంటల ద్వారా ఎకరానికి లక్ష రూపాయల నికర ఆదాయం పొందవచ్చని పిలుపునిచ్చారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పెరట్లో కూరగాయలు, పండ్ల తోటలు పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల ప్రిన్సిపల్ డా. ప్రీతం గౌడ్, డీఎల్పీఓలు ఆర్. పుల్లారావు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు కసరత్తు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : జిల్లాలోని మీడియా ప్రతినిధులకు 2026-28 సంవత్సరానికి కొత్త అక్రిడిటేషన్ల జారీ కోసం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవో 252 ప్రకారం ఈ కమిటీలో సభ్యత్వం పొందేందుకు జిల్లాలోని మీడియా అసోసియేషన్లు, సంఘాలు తమ ప్రతినిధుల పేర్లను ప్రతిపాదించాలని సూచించారు. బిగ్, మీడియం, స్మాల్ మరియు ఉర్దూ డైలీలతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, వీడియో, ఫోటో జర్నలిస్టుల విభాగాల నుండి ఒక్కో ప్రతినిధి పేరును ఒరిజినల్ లెటర్ ప్యాడ్‌పై రాసి ఫిబ్రవరి 26వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీ సభ్యులుగా ప్రతిపాదించే వారు తప్పనిసరిగా పూర్తి స్థాయి జర్నలిస్టులై ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందులో బిగ్ డైలీ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు 10 సంవత్సరాల అనుభవం, మిగిలిన విభాగాల ప్రతినిధులకు కనీసం 5 సంవత్సరాల మీడియా అనుభవం ఉండాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా అర్హులైన వారి వివరాలను అందజేయాలని ఆయన ఈ సందర్భంగా మీడియా సంఘాలను కోరారు.

# గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

### అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



అక్షర దర్బార్, మహబూబాబాద్: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, యువత భవిష్యత్తుకు ఇవి బంగారు బాటలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జ్ఞాన సంపదను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించడంలో విజ్ఞాన భాండాగారాలైన లైబ్రరీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు వసూలు చేసిన గ్రంథాలయ పన్నును ఎప్పటికప్పుడు చెల్లించి, లైబ్రరీల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీలత, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు శ్యాంసుందర్, విజయ్ ఆనంద్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసంఘాల శాంతియుత ర్యాలీ



అక్షర దర్బార్ శాయంపేట : నాగర్ కర్నూలు జిల్లా కమ్మెర గ్రామంలో రెండు నెలల చిన్నారిని అతికిరాతకంగా చంపిన అగ్రకుల గుండాలను వెంటనే శిక్షించాలని పత్తిపాక గ్రామంలో దళిత బహుజన, ప్రజాసంఘాలు నిరసన తెలుపుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. నిందితులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకొని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# నేడే పీఎం విశ్వకర్మ అవగాహన సదస్సు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు, దరఖాస్తుదారులకు అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రంలో గురువారం ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శీలం శ్రీమన్నారాయణ రెడ్డి తెలిపారు. కురవి రోడ్డులోని శ్రీ వీరభద్ర క్రేజీ ఫుడ్ వరల్డ్ వేదికగా ఉదయం 9:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ (MSME-DFO) హైదరాబాద్ మరియు జిల్లా పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో డిజిటల్ మార్కెటింగ్, ప్యాకేజింగ్ మెళకువలతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు. పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులు, దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# బంజారాల సంక్షేమంపై ప్రభుత్వ దృష్టి

- బంజారాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి
- మంత్రి సీతక్క



అక్షర దర్బార్/ ములుగు జిల్లా ప్రతినిధి: రాష్ట్రంలోని బంజారా కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అన్ని రంగాలలో బంజారా కులస్తులు అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుదవారం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ గుడి హరిత హోటల్ పక్కన తెలంగాణ ప్రభుత్వం సద్గురుసంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి కార్యక్రమం అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంధాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం హర్షించదగ్గ విషయమని, బంజారా కులస్తులు భవన నిర్మాణం ఏర్పాటు చేసుకోవడానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించడం జరిగిందని వివరించారు. రానున్న రోజులలో ప్రభుత్వం వారి సంక్షేమం కోసం వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. సమావేశానికి ముందు సీతక్క బంజారా భాషలో మాట్లాడి అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదువు వలననే ఏ జాతి అయినా బాగుపడుతుందని, చదువు, ఆరోగ్యం మీద శ్రద్ధ కనబరచాలని, అభివృద్ధి చెందిన వారు మిగతా వారి ఉన్నతికి పాటు పడాలని, మనం ఏం చేయాలన్న వారి స్ఫూర్తి తీసుకొవాలన్నారు. జిల్లాలో గిరిజన అధికారులు సామాజిక అభివృద్ధి అంశాలలో చొరవ తీసుకోవాలని, సంత్ సేవాలాల్ చూపిన ఆశయాలను అందరి సహకారంతో సాధించాలని, గిరిజన జాతి అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. ముందుగా ములుగు బంజారాల కుల పెద్ద పోరిక గోవింద్ నాయక్ మాట్లాడుతూ బంజారాలకు మద్దిమడుగు లో 20 ఎకరాల స్థలంలో గుడి నిర్మాణం కోసం కేటాయించినందుకు, ములుగు జిల్లా గట్టమ్మ వద్ద సుమారు 20 గుంటల స్థలం, ఆలయ నిర్మాణం కోసం పూర్తి సహకారాలు అందిస్తానని తెలిపినందుకు ములుగు జిల్లా బంజరాల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పోరిక గోవింద్ నాయక్, పూజారులు రమేష్ గిరి మహారాజ్, కిషన్ మహారాజ్, ఐటిడిఏ అధికారి జనార్ధన్, రాహుల్, బంజారా కులస్తులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ భవనాన్ని వేగంగా పూర్తి చేయాలి



అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి:జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అధికారులకు, ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా సుందరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి లతో కలసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అన్ని నిర్మాణ పనులను నాణ్యత తో పూర్తి చేయాలని, అనుకున్న సమయానికి ముందుగానే అందుబాటు లోకి తీసుకురావడానికి సంబంధిత అధికారులు, గుత్తేదారు చొరువ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో ఇద్దరు మృతి

### నివాళులర్పించిన కౌన్సిలర్ రేగూరి కరుణ

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ పరిధిలోని 7వ వార్డుకు చెందిన దొమ్మటి ప్రసంగి, 18వ వార్డుకు చెందిన ఒంటెరు సమ్మయ్యలు అనారోగ్యంతో మృతి చెందారు. వారి పార్థివ దేహాలను 18వ వార్డు కౌన్సిలర్ రేగూరి కరుణ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు దుంపేటి నాగరాజు, 7వ వార్డు అధ్యక్షులు ఉడుత సుమన్, ఉపాధ్యక్షులు గునిగంటి రవి తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. స్థానికులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతులకు అంతిమ వీడ్కోలు పలికారు.



## నూతన వధూవరులకు 'మిట్టపల్లి' ఆశీర్వాదాలు

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చింతల రమేష్ ముదిరాజ్ సంధ్యారాణిల కూతురు పయోస్నిక (హారిక) వినయ్ వివాహం ఇటీవల జరగగా, బుధవారం సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ నూతన వధూవరులను కలిసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య అంబేద్కర్ యువజన సంఘం చిట్యాల మండల అధ్యక్షుడు జన్నె యుగంధర్ నాయకులు పుల్ల రవితేజ గురుకుంట్ల కిరణ్ మాసు రమేష్ పుల్ల సతీష్ కళాకారుడు పుల్ల ప్రతాప్ పాల్గొన్నారు

# సాధించాలనే తపన లక్ష్యాన్ని చేరుస్తుంది

- మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వర్
- గీతాంజలి హై స్కూల్ లో అట్టహాసంగా వార్షికోత్సవ వేడుకలు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు





అక్షర దర్బార్, నర్సంపేట : ప్రతి విద్యార్థి లక్ష్యసాధనకు సాధించాలనే తపన ఉంటే గమ్యాన్ని చేరుకుంటారని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం నర్సంపేట పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వర్, గౌరవ అతిథులుగా శ్రీ గురుకుల విద్యాలయం వ్యవస్థాపకులు మోతే సమ్మి రెడ్డి, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు, నర్సంపేట మున్సిపల్ చైర్మన్ పెండెం లక్ష్మీ రామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్, నర్సంపేట కౌన్సిలర్ బీరం భరత రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. ఒక్కో మెట్టు ఎక్కుతూ గీతాంజలి విద్యా సంస్థలను అనేక శాఖలుగా విస్తరించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సుబ్బారావు ఎంతో అభినందనీయుడు అన్నారు .ఇలాగే విద్యారంగంలో ముందుకు ప్రయాణించి నడిపించాలని కోరారు.విద్యార్థులు కూడా అంతే కృషి కనబరిచి రాణించాలని సూచించారు. పాఠశాల అంటే అన్ని కళలకు నిలయమని ఎన్ని విషయాలు ఇక్కడే నేర్చుకొని మీ మార్గాన్ని సుగమం చేసుకోవాలని చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ముఖ్యమని తెలియజేశారు. అనంతరం గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ నిరంతరం ఏదో ఒక పని నేర్చుకోవాలన్న తపన నన్ను స్థాయిలో నిలబెట్టిందని ప్రతి ఒక్కరూ సమయాన్ని సద్వినియోగం చేస్తే విజయాలు తప్పకుండా లభిస్తాయనీ తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించిన అతిథులు వారి ప్రతిభను చూసి ఆశ్చర్య చకితులయ్యారు. మున్సిపల్ చైర్మన్ పెండెం లక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ.. ఈనాటి కార్యక్రమానికి రావడం చాలా ఆనందమని అంతరించిపోతున్న కలలు పండుగలను కళ్ళకు కట్టినట్లు విద్యార్థులు చూపారని మరియు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన నమూనాలు చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా అన్ని విధాలా కార్యకమాన్ని ముందుకు నడిపించి వియవంతం కావడంలో ప్రిన్సిపాల్ ఎన్.రాజేష్ రచించిన ప్రణాళిక కారణం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.

## మీడియా అకాడమీ చైర్మన్ పదవి
# రెండేళ్లు పొడిగింపు

**- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి పదవీకాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన అకాడమీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 ఫిబ్రవరి 26న శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. రెండేళ్ల కాలపరిమితితో అప్పట్లో ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. జర్నలిజం రంగంలో ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆయన విశేష కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. కొత్త ఉత్తర్వుల ప్రకారం శ్రీనివాస్ రెడ్డి మరో రెండేళ్లు పదవిలో ఉంటారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల మంజూరులో కీలక పాత్ర పోషిస్తారు. సంక్షేమ పథకాల అమలు బాధ్యతలను పర్యవేక్షిస్తారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే ఈ పదవీకాలం పొడిగింపును చేపట్టింది.

## ఘోష్ కమిషన్ నివేదికపై
# విచారణ వాయిదా

అక్షరదర్బార్, హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. అడ్వొకేట్ల వాదనలు విన్న న్యాయస్థానం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు గతంలో పిటిషన్లు దాఖలు చేశారు. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, మాజీ సీఎస్ ఎస్.కె. జోషి కూడా కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై న్యాయస్థానం ఇవాళ విచారణ చేపట్టింది. హరీశ్ రావు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన పరిధి దాటి వ్యవహరించిందని ఆయన పేర్కొన్నారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టం ప్రకారం ఈ నివేదిక చెల్లదని వాదించారు. మేడిగడ్డ పిల్లర్ కుంగిపోయిన ఘటనపై వాస్తవాలు సేకరించడమే కమిషన్ బాధ్యత అని స్పష్టం చేశారు. బాధ్యతను విస్మరించి కమిషన్ నివేదిక ఇచ్చిందని కోర్టుకు తెలిపారు. న్యాయవాది వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది. ఎల్లుండి కేసీఆర్ తరఫున న్యాయవాది శేషాద్రి నాయుడు తన వాదనలు వినిపిస్తారు. ఈ కేసులో కమిషన్ నివేదిక చట్టబద్ధతపై కోర్టు నిర్ణయం కీలకం కానుంది. ప్రభుత్వ పక్షం కూడా తమ వాదనలను సిద్ధం చేసుకుంటోంది.

## తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలకు
# శాశ్వత భవనాలు

- మొదటి 60 తహసీల్దారు కార్యాలయాలు..
- ఐదు ఆర్డీవో భవనాల నిర్మాణం
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. మొదటి దశలో 60 తహసీల్దార్ కార్యాలయాలు, ఐదు ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక భవనాలు నిర్మిస్తారు. రెండో విడతలో శిథిలావస్థకు చేరిన 170 కార్యాలయాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తారు. అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేలా డిజైన్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ఈ నమూనాలను త్వరలోనే ఖరారు చేయనున్నారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని మంత్రి విమర్శించారు. దీనివల్ల అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్లను ప్రజలకు దూరంగా నిర్మించి గత పాలకులు నిర్వహణను గాలికి వదిలేశారని మండిపడ్డారు. రిజిస్ట్రేషన్ల శాఖలో కూడా అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ పరిసర జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి కొత్త భవనాలు నిర్మిస్తున్నారు. గచ్చిబౌలిలో నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మరికొద్ది నెలల్లో ఈ భవనం ప్రారంభానికి సిద్ధమవుతుందని మంత్రి వివరించారు. రెవెన్యూ వ్యవస్థను ఆధునీకరించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# మహిళా శక్తి దేశాభివృద్ధికి పునాది

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : మహిళా శక్తి దేశ అభివృద్ధికి పునాది వంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు బుధవారం భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో బేటీ బచావో బేటీ పడావో మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారత, విద్య, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి సంఘాల బలోపేతం చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. మహిళల భద్రత, స్వాభిమానంతో జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా అదిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి జిల్లా సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి ,మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ , అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు



## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చాలి

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి**

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్నిటిని సత్వరమే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మహిళలు బతుకమ్మతో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సెంటర్ లో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళులు అర్పించారు అనంతరం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జ్యోతిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేస్తున్న పోరాట ఫలితంగా గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ,నెలకు రూ.25 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించిందని అన్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ , పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్పందించి ఈ హామీలను అమలు చేస్తామని ప్రకటించడం జరిగిందని అన్నారు.. అదేవిధంగా ఈనెల 23న రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం 8 వారాల లోపు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ 25 వేల పెన్షన్ ఇవ్వాలని తీర్పుని ఇవ్వడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యపై కమిషన్ ఏర్పాటు చేసి ఉద్యమకారుల అన్ని డిమాండ్లను త్వరలో నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం నాయకులు మందల రవీందర్ రెడ్డి, నాయకురాళ్లు భారతక్క బొమ్మెర రాజేశ్వరి, ప్రసన్న, ఒరుగంటి లక్ష్మి, గాదం జయ, లావుడియా తిరుపతమ్మ, మామిడి శారద, లత, భాగ్యలక్ష్మి,సుశీల తదితరులు పాల్గొన్నారు

# గణపతి జనజీవన స్రవంతిలోకి రావాలి

- సోదరుడు రామచంద్ర రావు విజ్ఞప్తి
- గణపతిపై కేసులు ఎత్తివేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

అక్షరదర్బార్, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి పోలీసులకు లొంగిపోవాలని ఆయన సోదరుడు రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు. 'ఆపరేషన్ కాగార్' చివరి దశకు చేరుకున్న తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే పార్టీకి చెందిన పలువురు అగ్రనేతలు వరుసగా లొంగిపోతున్నారు. తిప్పిరి తిరుపతి, చొక్కారావు అలియాస్ దామోదర్, మల్లా రాజిరెడ్డి, నర్సింహారెడ్డి వంటి ప్రముఖ నేతలతో పాటు సుమారు 20 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే గణపతి ఆచూకీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గణపతి వెంటనే జనజీవన స్రవంతిలోకి రావాలని రామచంద్రరావు బుధవారం మీడియా మాధ్యమాల ద్వారా కోరారు. కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కూడా ఆయన రాక కోసం ఆశగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. గణపతితో కలిసి పనిచేసిన కీలక నాయకులందరూ ఇప్పటికే లొంగిపోయారని గుర్తు చేశారు. ఆయనపై దాదాపు 12 రాష్ట్రాల్లో కేసులు ఉన్నట్లు సమాచారం అందుతోంది. గణపతి గనుక లొంగిపోతే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని ఆయన విన్నవించారు. గణపతిపై ఉన్న కేసులను ఎత్తివేసి ఆయనకు ప్రశాంత జీవనం కల్పించాలని రామచంద్రరావు కోరుతున్నారు. వయసు పైబడటం, ఆరోగ్య కారణాల దృష్ట్యా ఆయన తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారు. ప్రభుత్వం కూడా లొంగిపోయే మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తోంది. ఈ క్రమంలో గణపతి తీసుకునే నిర్ణయం మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తుపై ప్రభావం చూపనుంది. అగ్రనేత లొంగుబాటుపై పోలీస్ వర్గాల్లో కూడా ఆసక్తికర చర్చ సాగుతోంది.



## రోడ్డు ప్రమాద మృతుడికి మంత్రి సీతక్క నివాళి..

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన తూముల అనిల్ మంగళవారం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంటనే బుధవారం మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అనిల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి వెంట ఇంచర్జ్ సర్పంచ్ మునిసెపల్లి కుమార్ గౌడ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ అశోక్ గౌడ్, బంజారుపల్లి సర్పంచ్ కుంచం రఘు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జగన్నాథ చారి పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915